నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

స్వార్థ చింతనంబు వ్యర్థమే బ్రతుకున
పరులమేలుజేయు,మరచిబోకు
జేసినట్టి మేలు జెడుజేయదెప్పుడూ
కష్టకాలమందు కలిసివచ్చు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




సంచిక : 210 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 10-11-2025 | పేజీలు -8 | వెల: రూ. 5.00


# జూబ్లీ బైపోల్‌లో ముగిసిన ప్రచారం

## అమల్లోకి ఎన్నికల ఆంక్షలు ...రేపే పోలింగ్

- మూగబోయిన మైకుల మోత, ప్రచార సందడి
- సంక్షేమ పథకాలు, అభివృద్ధే నినాదంగా ప్రజల్లోకి కాంగ్రెస్
- కాంగ్రెస్ వైఫల్యాలే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రచారం
- రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తించిన పార్టీలు

**హైదరాబాద్: నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల హోరాహోరీ ప్రచారానికి ఆదివారం సాయంత్రం 6 గంటలతో తెరపడింది. దాంతో పార్టీల ప్రచార వాహనాల సందడి, నాయకుల ప్రసంగాలు, కార్యకర్తల నినాదాలతో మార్మోగిన వీధులు ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారాయి. ర్యాలీలు, రోడ్ షోలు, కార్నర్ మీటంగ్‌ల హడావుడి ముగిసింది. గడిచిన ఇరవై రోజులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, కాలనీల్లో అన్ని పార్టీల ముఖ్య నేతలు వివిధ రూపాల్లో తమ ఎన్నికల ప్రచారంతో హోరెత్తించాయి. ఇక ప్రచారానికి తెరపడటంతో ఎన్నికల ఆంక్షలు అమల్లోకి రాగా.. ఇక అందరి దృష్టి రేపటి పోలింగ్‌పైనే నిలిచింది. ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో -మిగతా 2 లో






## మా బిడ్డలెలా బతకాలి?

- చిన్నారుల 'ఊపిరి'పై కాలుష్య ప్రభావం
- ఢిల్లీలో ఇండియాగేట్ వద్ద నిరసనలు

**న్యూఢిల్లీ**
దేశ రాజధానిలో కాలుష్య తీవ్రతతో గాలి నాణ్యత రోజు రోజుకూ దిగజారుతోంది. బీజేపీ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ ఢిల్లీ వాసులు ఆందోళనకు దిగారు. వివిధ వర్గాల ప్రజలు, తల్లిదండ్రులు, పర్యావరణ కార్యకర్తలు ఇండియా గేట్ వద్ద భారీ నిరసన చేపట్టారు. చిన్నారులతో కలిసి అనేక మంది మహిళలు హాజరై.. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. "ప్రజా ప్రతినిధులతో సమావేశం కావాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోరినప్పటికీ నిరాకరించారు. కాలుష్య తీవ్రత వల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే తల్లిదండ్రులు భారీ స్థాయిలో వీధుల్లోకి వచ్చి నిరసన చేపట్టారు" అని పర్యావరణవేత్త భావ్రీన్ ఖండారీ పేర్కొన్నారు. ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరి ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని, స్వచ్ఛమైన గాలిలో పెరిగే పిల్లలతో పోలిస్తే వీరి జీవితకాలం దాదాపు పదేండ్లు తక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.స్వచ్ఛమైన గాలిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మరో నిరసనకారుడు ఆరోపించారు. మాజీ సీఎం షీలా దీక్షిత్ హయాంలో -మిగతా 2 లో





## రేపు బీహార్‌లో రెండోవిడత పోలింగ్

- ముగిసిన ఎన్నికల ప్రచారం
- బరిలో1302 మంది అభ్యర్థులు
- 3.70 కోట్లకుపైనే ఓటర్లు..

**రాంచీ– నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీహార్‌లో రెండో విడత ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి ఈ నెల 11న (మంగళవారం) 20 జిల్లాల పరిధిలోని మిగతా 122 సీట్లకు ఓటింగ్ జరగనుంది. బరిలో 1302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3.70 కోట్లకుపైగా ఓటర్ల చేతిలో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది. రెండో విడత జరగనున్న పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు 1650 భద్రతాబలగాల కంపెనీలను మోహరించనున్నట్టు బీహార్ డిజిపి తెలిపారు. ఈనెల 6న 18 జిల్లాల పరిధిలోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ పోలింగ్ జరిగింది. ఈసారి అధికార ఎన్‌డిఎ, మహాఘట్ బంధన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. అధికార, ప్రతిపక్ష కూటములు ఈ ఎన్నికలను -మిగతా 2 లో

## అనారోగ్యమే నిజమైన పేదరికం



- కంచిపీఠం సేవలు ముదావాహం
- శంకర్ కంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ ప్రారంభోత్సవ సభలో సిఎం చంద్రబాబు

**గుంటూరు నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆరోగ్యంగా లేకపోతే ఎన్ని ఆస్తులున్నా నిరుపయోగమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర్ కంటి ఆస్పత్రి ప్రాంగణంలోనే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ బ్లాక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ డబ్బు, బంగ్లాలు, కార్లు, హోదా ఎన్ని ఉన్నా మంచి ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదన్నారు. అనారోగ్యమే నిజమైన -మిగతా 2 లో


## జపాన్ తీరంలో భారీ భూకంపం



- సునామీ హెచ్చరికలు జారీ
- అండమాన్‌లోనూ ప్రకంపనలు

**టోక్యో, న్యూఢిల్లీ**
జపాన్ తీరంలో ఆదివారం సాయంత్రం భారీ భూకంపం సంభవించింది. ఈ భారీ భూకంపం తరువాత కూడా వరస ప్రకంపనలు తీరాన్ని కుదిపేశాయి. దీంతో సునామీ హెచ్చరికల్ని జారీ చేశారు. జపాన్ వాతావరణ సంస్థ సమాచారం ప్రకారం ఆదివారం సాయంత్రం 5:12 గంటల ప్రాంతంలో ఉత్తర జపాన్‌లోని ఇవాటే ప్రిఫెక్చర్ తీరానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలో సముద్ర ఉపరితలం నుంచి 10 కిలోమీటర్లు లోతున ఈ భూకంపం సంభవించింది. దీని తీవ్రతను రిక్టార్‌పై 6.9గా గుర్తించారు. తరువాత కూడా వరుస ప్రకంపనలు వచ్చాయి. దీంతో జపాన్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కె సునామీ హెచ్చరికలను జారీ చేసింది. జపాన్ ఉత్తర తీరంలో ఒక మీటర్ ఎత్తు వరకూ సునామీ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. సునామీ ప్రమాదం ఉన్నందున తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇవాటే ప్రిఫెక్చర్‌లోని ఒఫునాటో నగరం, ఒమినాటో పోర్టు వద్ద దాదాపు 10 సెంటీమీటర్ల మేర సముద్రపు అలలు ఎగసిపడ్డాయని, సునామీని గురించామని ఎన్‌హెచ్‌కె తెలిపింది. జపాన్ రైల్వే సమాచారం ప్రకారం -మిగతా 2 లో

# 2034 వరకు మాదే అధికారం



### బీఆర్ఎస్ కాలగర్భంలో కలిసిపోయిన పార్టీ

- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలవాల్సిందే..అభివృద్ధి జరగాల్సిందే
- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ గుజరాత్ గులాంలు
- రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా స్పందించట్లేదు
- బీజేపీకి జవసత్వాలు అందించాలని తాపత్రయం
- 2029లో జమిలీ ఎన్నికలు మీట్ ది ప్రెస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్,నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలో 2029లో జమిలీ ఎన్నికలు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆమేరకు పక్కా ప్రణాళికతో ఉన్నదనీ, దానికోసం అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసేందుకూ సిద్ధమవుతున్నదని తెలిపారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ -మిగతా 2 లో



## చలి మొదలైంది బాబోయ్.!

- ఈ నెల 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చలి గరిష్ట స్థాయిలో ఉండబోతోంది
- వెల్లడించిన వాతావరణ శాఖ

**హైదరాబాద్: , నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణను మొన్నటిదాకా భారీ వర్షాలు కుదిపేశాయి. ఆ వర్షాల తాకిడికి చేతికొచ్చిన పంటలన్నీ నీటి మునిగి రైతులను కూడా కన్నీటిలో ముంచేశాయి. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం తెలంగాణను చలి వణికిస్తోంది. ఉదయం 7 గంటలకు కూడా సూర్యుడు ఉదయించడం లేదు. పొద్దంతా ఎండ బాగా ఉంటోంది. కానీ సాయంత్రం 5 గంటల సమయానికే పొద్దుపోయి, -మిగతా 2 లో



## జూబ్లీహిల్స్ నుంచే కాంగ్రెస్ పతనం

- బీఆర్ఎస్‌కు 'జూబ్లీహిల్స్' బ్రహ్మరథం
- యూసుఫ్‌గూడ రోడ్‌షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్: ,నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ నుంచే కాంగ్రెస్ పతనం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గెలిచిన 64మంది ఎమ్మెల్యేలకే దిక్కులేదు.. కొత్తగా జూబ్లీహిల్స్‌లో ఏదో చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలు నమ్మొద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ లేకపోతే ముస్లింలు లేరన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ ఉప ఎన్నికలో గట్టిగా బుద్ధి చెప్పాలని మైనారిటీలకు పిలుపునిచ్చారు. నోట్లు కాకుండా మంచి పాలన అందించేవారిని ఎన్నుకోవాలని ఓటర్లకు -మిగతా 2 లో

## ఉపరితల ఆవర్తనంతో మోస్తరు వర్షాలు

- భారత వాతావరణ సంస్థ



**అమరావతి -**
ఉత్తర తమిళనాడు, దాని పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు నైరుతి బంగాళాఖాతం నుంచి కేరళ వరకూ, శ్రీలంక, తమిళనాడు మీదుగా సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ద్రోణి క్రమంగా బలహీన పడుతున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, యానాంలలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ఫలితంగా రాష్ట్రంలో ఉత్తర కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకట్రెండు చోట్ల పడే అవకాశం ఉందని వెల్లడించింది.



## తెలుగు మీడియం చదువులకు స్వస్తి!

- ప్రైవేట్ బడుల్లో అంతా ఇంగ్లిష్ మీడియమే
- అక్కడ తెలుగు మీడియం 0.48 శాతమే
- ఇదే కోవలో ప్రభుత్వ, ఎయిడెడ్ బడులు
- క్రమంగా తగ్గిపోతున్న తెలుగు మీడియం

| పాఠశాల | తెలుగు | ఇంగ్లిష్ |
| --- | --- | --- |
| ప్రభుత్వ | 15.66% | 78.75% |
| ఎయిడెడ్ | 14.24 % | 76.18% |
| ప్రైవేట్ | 0.48% | 97.09% |

**హైదరాబాద్ నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థుల వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నది. పిల్లలను ఇంగ్లిష్ మీడియం చదివించేందుకే తల్లిదండ్రులు ఆసక్తి కనబర్చుతున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ బడుల్లో తెలుగు మీడియం విద్యార్థులు చాలా తక్కువ మంది ఉంటున్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లలో మొత్తం 36.19 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 35.13 లక్షల మంది (97.09 శాతం) ఇంగ్లిష్ మీడియంలోనే చదువుతున్నారు. ఇక తెలుగు మీడియంలో చదువుతున్న వారి సంఖ్య 17,329 -మిగతా 2 లో

# రేపు బీహార్‌లో రెండోవిడత పోలింగ్

(మొదటి తరువాయి)

ప్రతిష్టాత్మకంగా తీసుకుని హెూరాహెూరీగా ప్రచారం నిర్వహించాయి. ఎన్‌డిఎ తరపున ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, పలువురు బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు బహిరంగసభల్లో పాల్గొన్నారు. మహాఘట్‌బంధన్ నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రియాంకా గాంధీ, ఆర్‌జెడి అగ్రనేత, మహాఘట్‌బంధన్ సిఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ సుడిగాలి ప్రచారం నిర్వహించారు. సిపిఎం అభ్యర్థులు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. వారి తరపున ఆ పార్టీ నేతలు బృందాకరత్, సలీం తదితరులు ప్రచారంలో భాగస్వాములయ్యారు. అభ్యర్థుల వెంట పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీలతో.. సిపిఎం గెలిస్తే%ొ% ప్రజాసమస్యలు పరిష్కారమయ్యేలా కృషిచేస్తామని ఓటర్లను అభ్యర్థించారు. ఈనెల 14న బీహార్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# మా బిడ్డలెలా బతకాలి?

(మొదటి తరువాయి)

ఢిల్లీ 'గ్రీన్ క్యాపిటల్'గా ఉండేదని, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో చేరిందన్నారు. రాజకీయ నాయకులు మాత్రం బాధ్యత వహించకుండా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇండియా గేట్ వద్ద నిరసనలకు దిగారని పేర్కొంటూ పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు.

# అనారోగ్యమే నిజమైన పేదరికం

(మొదటి తరువాయి)

పేదరికమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇతరులకు సేవ చేయాలని కోరారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కంచిపీఠం ద్వారా శంకర్ ఆస్పత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. శంకర్ కంటి ఆస్పత్రుల ద్వారా దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 14 ఐ హాస్పిటల్స్ నిర్మించి ఇప్పటి వరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. ఈ ఆస్పత్రుల్లో రోజుకు సగటున 750 ఉచిత కంటి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని వివరించారు. 2003 నుంచి గుంటూరులో నిర్మించిన శంకర్ ఆస్పత్రి పేదలకు ఉచిత వైద్యం అందించడం ముదావాహం అన్నారు. శంకర్ ఆస్పత్రి ద్వారా గ్రామీణ సేవా ప్రాజెక్ట్ 'గిఫ్ట్ ఆఫ్ విజన్' కింద ఇప్పటివరకు 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆరోగ్య రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఎపి ఒక మోడల్‌గా ఉంటుందన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి అనేది మా విధానమని తెలిపారు. కంచి పీఠం స్వామీజీ శ్రీ శంకర విజేయంద్ర సరస్వతి మాట్లాడుతూ.. తమ పీఠం విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన వంటి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు, ఏలూరు సాంబశివరావు, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, శంకర్ కంటి ఆస్పత్రుల ట్రస్టు నిర్వాహకులు పద్మశ్రీ ఆర్.వి.రమణ, జె.కె.రెడ్డి, మురళీకృష్ణమూర్తి, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ తీరంలో భారీ భూకంపం

(మొదటి తరువాయి)

ఈ ప్రాంతంలో బుల్లెట్ రైళ్లు ఆలస్యంగా నడిచాయి. భూకంపాల కారణంగా విద్యుత్ కోతలు ఏర్పడ్డాయని క్యోడో న్యూస్ తెలిపింది. ఈ ప్రాంతంలో ఉన్న ఒనాగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి ప్రమాదం సంభవించలేదని వార్తా సంస్థలు తెలిపాయి. అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ సమాచారం ప్రకారం దీని కంటే ముందు జపాన్‌లోని అతిపెద్ద ద్వీపమైన హౌన్షు తూర్పు తీరంలో 6.26 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఇందులో ఇవాటే ప్రాంతం కూడా ఉంది. ప్రపంచంలోనే అత్యధిక భూకంపాలకు గురయ్యే దేశాలలో జపాన్ ఒకటి. జపాన్ మార్చి 2011లో ఘోరమైన భూకంపం, సునామీని ఎదుర్కొంది.

# చలి మొదలైంది బాబోయ్.!

(మొదటి తరువాయి)

చలి తీవ్రత పెరుగుతోంది. అయితే తాజాగా వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర తెలంగాణలోని జిల్లాలలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలతో చలి తీవ్రత పెరుగుతుందని తెలిపింది. ఈ నెల 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చలి గరిష్ట స్థాయిలో ఉండబోతోందని వాతావరణ శాఖ నిపుణులు వెల్లడించారు. సాయంత్రం 6 గంటల లోపు ప్రజలు ఇండ్లలోకి చేరుకోవాలని వారు సూచించారు. మరీ ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, వెచ్చదనాన్ని ఇచ్చే దుస్తులు ధరించి, చలి నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండని తెలిపారు.

# తెలుగు మీడియం చదువులకు స్వస్తి!

(మొదటి తరువాయి)

(0.48శాతం) మాత్రమే. తరగతుల వారీగా పరిశీలిస్తే 10 తరగతిలో అత్యధికంగా 98.22 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. ఒకటో తరగతి పిల్లల్లో 93.57 శాతం ఇంగ్లిష్‌లోనే చదువుతుండటం గమనార్హం.

**అదే బాటలో సర్కారు బడులు**

రాష్ట్రంలో ప్రైవేట్ బడుల్లోనే కాదు.. సర్కారు, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ ఇంగ్లిష్ మీడియం హవానే నడుస్తున్నది. సర్కారు బడుల్లో మొత్తం 22.42 లక్షల మంది విద్యార్థులుంటే 17.65 లక్షలు (78.75శాతం) ఇంగ్లిష్ మీడియంలోనే చదువుతున్నారు. మరో 3.51 లక్షలు (15.66 శాతం) మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులున్నారు. తరగతుల వారీగా గమనిస్తే 6వ తరగతిలో 82.20 శాతం, 7వ తరగతిలో 82.28 శాతం, 8వ తరగతిలో 82.28 శాతం, 9వ తరగతిలో 81.86 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. తెలుగు మీడియం పరిశీలిస్తే ఐదో తరగతిలో 20.31 శాతం మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని తరగతుల్లో ఇదే అత్యధికం. ఇక ఎయిడెడ్ స్కూళ్లలో మొత్తం 59,140 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 45,054 (76.18శాతం) ఇంగ్లిష్ మీడియం వారు కాగా, 8,420 (14.24 శాతం) తెలుగు మీడియం వారున్నారు. మిగిలిన వారు ఉర్దూ, కన్నడ, మరాఠీ, హిందీ, తమిళ మీడియంలో చదువుతున్నారు.

# జూబ్లీ బైపోల్‌లో ముగిసిన ప్రచారం

(మొదటి తరువాయి)

నిక్షిప్తం చేయనుండగా, అభ్యర్థుల భవితవ్యం ఈనెల 14న వెలువడనున్న ఓట్ల లెక్కింపుతో తేలనుంది.

**అధికార, ప్రతిపక్షాల వ్యూహాలు**

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ.. చివరి రోజు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని నినాదంగా చేసుకుని ఓటర్లను అభ్యర్థించింది. ముఖ్యంగా డివిజన్‌ల వారీగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, జూపల్లితో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మెన్లు ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, స్థానిక నాయకులు, అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో ప్రచారాన్ని హెూరెత్తించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తానే తీసుకుంటానని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను లక్ష్యంగా చేసుకుని ప్రచారం సాగించింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు.. తమ ప్రసంగాల్లో అధికార పార్టీపై విమర్శలు గుప్పించారు. కేటీఆర్ రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనతో రెండేండ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. హరీశ్ రావు తండ్రి




మరణించినప్పటికీ.. ప్రచార బాధ్యతల్లో కేటీఆర్‌కు అండగా నిలిచారు. బీజేపీ కూడా తన ప్రచారాన్ని ముమ్మరంగా సాగించింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను విమర్శిస్తూ ప్రచారం చేసింది. ఇందులో భాగంగా బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలతో పాటు పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర సీనియర్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన పార్టీలన్నీ ఈ ఉప ఎన్నిక ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రచారం సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. ఇప్పుడు అందరి చూపు ఓటరు నాడీపైనే నిలిచింది. రేపు పోలింగ్ కేంద్రా లకు తరలివచ్చి తమ నిర్ణయాన్ని వెల్లడించనున్నారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే.

**సర్వేల గందరగోళం**

వివిధ సంస్థలు విడుదల చేసిన ఒపీనియన్ పోల్స్ మిశ్రమ ఫలితాలను వెల్లడిస్తూ రాజకీయ గందరగోళాన్ని మరింత పెంచాయి. సైదులు సర్వే, "మూడ్ ఫర్ ది పబ్లిక్ అండ్ పీపుల్" సర్వే, లోక్ పోల్ సర్వే వంటివి కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పాయి. నవీన్ యాదవ్ తన సామాజిక సేవతో 50.65శాతం ఓట్లు సాధించవచ్చని ఒక సర్వే అంచనా వేసింది. మరోవైపు చాణక్య, కేకే, శాస్ వంటి సర్వేలు బీఆర్ఎస్ పార్టీకి విజయావకాశాలు ఉన్నాయని అంచనా వేశాయి. ముఖ్యంగా కేకే సర్వే బీఆర్ఎస్‌కు 55శాతం ఓట్లు, కాంగ్రెస్‌కు 37శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది.

**పార్టీలకు ప్రతిష్టాత్మకం..**

ఈ ఉపఎన్నిక ఫలితం అధికార, ప్రతిపక్షాలకు రాజకీయంగా కీలకంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుకు ఈ ఎన్నికను ఒక రెఫరెండంగా భావిస్తున్నారు. గెలుపు ద్వారా హైదరాబాద్‌లో పార్టీ పట్టును నిరూపించుకోవాలని, తన నాయకత్వాన్ని మరింత బలపరుచుకోవాలని ఆయన భావిస్తున్నారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని నింపేందుకు ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడం బీఆర్ఎస్‌కు అత్యంత అవసరం. ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా తమను తాము నిరూపించుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. భిన్నమైన సర్వేలు, పార్టీల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఓటరు ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది నవంబర్ 14న ఓట్ల లెక్కింపు తర్వాతే స్పష్టమవుతుంది.

# 2034 వరకు మాదే అధికారం

(మొదటి తరువాయి)

కార్యక్రమాలు, ఆ కాలంలో రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టులు, నిధులు తదితరాంశాలను వివరిస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలను ఏకరువు పెట్టారు. ప్రస్తుతం తాము అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు, అభివృద్ధి, చేపడుతున్న పనులను సోదాహరణంగా వివరించారు. బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కిషన్‌రెడ్డిలపై సెటైర్లు వేశారు. ఓటమి బాధతో, తన మాట వినని కొడుకు చేష్టలతో విసిగిపోయిన కేసీఆర్, ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. అందువల్ల ఆయనపై తమకు సానుభూతి తప్ప కోపం లేదన్నారు. అయితే బీఆర్ఎస్ అధినేతగా జూబ్లీహిల్స్ అభ్యర్థి సునీతకు ఓటేయాలంటూ కేసీఆర్ ఇప్పటికీ ఓటర్లకు విజ్ఞప్తి చేయకపోవటం విచిత్రంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల సమస్యలను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదని సీఎం విమర్శించారు. బీఆర్ఎస్ ఓనర్ (అధినేత)కు వారి ఎమ్మెల్యేలపైనే నమ్మకం లేదనీ, అందుకే తనను కలిసేందుకు వారు భయపడుతుం టారని చెప్పారు. అలా భయపడేవారు తమ తమ నియో జకవర్గాలకు



ఏం ఒరగబెడతారని ప్రశ్నించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు తర్వాత అభివృద్ధి ఊపందుకుందని తెలిపారు. అక్కడి ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీన ప్రతిపాద నలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామనీ, ఆరు నెలల్లో ఆ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలవాల్సిందే**

'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాల్సిందే.. అభివృద్ధి జరగాల్సిందే%ొ%' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 2034 వరకు రాష్ట్రంలో అధికారం తమదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2029లో జమిలీ ఎన్నికలు వస్తాయని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రానికి నష్టం జరుగుతున్నా పట్టించుకోకుండా గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సహవాసముందని చెప్పారు. వారిద్దరూ కలిసి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని పునరుద్ఘాటించారు. 2023 ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి 8 ఎంపీ స్థానాలిచ్చి గెలిపించిన బీఆర్ఎస్‌కు 'థ్యాంక్స్ గివింగ్'లా కిషన్ రెడ్డి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అందుకే బీఆర్ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకించే కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వరరెడ్డి లాంటి వారిని జూబ్లీహిల్స్ ప్రచారానికి దూరం పెట్టారని ఉదహరించారు. బీఆర్ఎస్, బీజేపీ ఫెవికాల్ బంధానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఒక లిట్మస్ టెస్టులాంటిదని ఎద్దేవా చేశారు.

# జూబ్లీహిల్స్ నుంచే కాంగ్రెస్ పతనం

(మొదటి తరువాయి)

ఆయన సూచించారు.రేవంత్‌రెడ్డి అంటే ఆర్ఎస్ఎస్ అని అభివర్ణించిన అసదుద్దీన్ కాంగ్రెస్‌కు ఎలా మద్దతిస్తున్నారని నిలదీశారు. ఉప ఎన్నికలో గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నదని ఒక్కో ప్రాంతంలో రూ.4వేల నుంచి రూ.6వేలు పంచుతూ ఓటుకు నోటు స్కీమును తీసుకొచ్చిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు న్యాయం చేసే గొప్ప అవకాశం 4లక్షల మంది జూబ్లీహిల్స్ ప్రజలకు దక్కిందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేటీఆర్ కోరారు. ప్రచారంలో చివరి రోజైన ఆదివారం యూసుఫ్‌గూడలో రోడ్‌షోలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.వేలాదిగా తరలివచ్చిన జనం

కేటీఆర్ రోడ్‌షోకు జూబ్లీహిల్స్ ప్రజలు వేలాదిగా కదిలివచ్చారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తమ పింఛన్లు పెంచుతామని మోసం చేసిన కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అలాగే రోడ్‌షోలో హైడ్రా అరాచకాలు, రైతన్నల ఇబ్బందులను ఓటర్లకు వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

**బీఆర్ఎస్‌కు 'జూబ్లీహిల్స్' బ్రహ్మరథం**

రెండేళ్ల కాంగ్రెస్ అరాచక పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందుల నుంచి బయటపడేందుకు గులాబీ పార్టీకి అండగా నిలుస్తున్నారు. ఉప ఎన్నిక ప్రచారంలో స్వచ్ఛందంగా తరలివస్తూ అడుగడుగునా అపూర్వ




ఆదరణ, అభిమానం చూపారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ అఖండ మెజారిటీతో గెలిపిస్తామని శపథం చేస్తున్నారు. ఆదివారం యూసుఫ్‌గూడలో కేటీఆర్ రోడ్ షోకు భారీగా తరలివచ్చి బీఆర్ఎస్‌కు అండగా ఉంటామని.. తమ ఓటుతో రేవంత్ సర్కారుకు గట్టిగా బుద్ధి చెబుతామని స్పష్టంచేశారు.

**మా బాకీలేమైనయ్..?**

'బతికుంటే బలుసాకైనా తిని బతుకొచ్చు' అనే సామెత అచ్చం మన సీఎం రేవంతం సారుకు సరిపోతుందేమో. సీఎం సీటేమోగాని ఎక్కడికెళ్లినా జనాల నుంచి తీవ్ర ఆక్రోశాన్ని చవిచూస్తున్నాడు మరి. ఎందుకంటే ఇచ్చిన 420 హామీల్లో ఒక్కటి కూడా సరిగా అమలు చేయకపోవడమే. తులం బంగారం ఎక్కడ?, మా స్కూటీలు ఏవి?, మా రూ.2,500 ఎప్పుడిస్తరు? అని ఆదివారం యూసుఫ్‌గూడలో జరిగిన రోడ్‌షోలో మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
సోమవారం 10 నవంబర్ 2025

## జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మంత్రి వివేక్‌తో
# విస్తృత ప్రచారం చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

**మానకొండూరు, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారం చివరి రోజైన ఆదివారం షేక్‌పేటలోని 61, 62వ బూత్‌ల పరిధిలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, గనుల శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సునీతా రావులతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూకాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అభివృద్ధి సాధనకు కాంగ్రెస్ పార్టీనే మార్గమని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే చేసి చూపించిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనాదిగా గరీబోళ్లకు అండగా ఉంటుందని గుర్తుచేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో పిసిసి సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎల్ గౌడ్, ఒగ్గు దామోదర్, పార్టీ నాయకులు బండారు రమేష్, నందగిరి రవీంద్ర చారి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, పులి కృష్ణ, మర్రి ఓదెలు యాదవ్, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస రావు, గోపు మల్లారెడ్డి, తొర్తి అరవింద్, వేల్పుల సంపత్, బి సంపత్, ఎగ్గని రమేష్, ఓదెలు దాసరి రమేష్, టి రాజయ్య, కీసరి వెంకటేష్, ఆరేపల్లి ఓదెలు, వి శ్రీనివాస్, జగన్ పదాల తిరుపతి, గడ్డం సంపత్, తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, బండ మల్లేశం, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, ధ్యావ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర సురేష్, ఇర్ఫాన్, కొమ్మెర రవీందర్ రెడ్డి, చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, గుడాల శ్రీకాంత్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీలకు న్యాయం కోరుతూ మౌన దీక్ష



**దేవరకొండ, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ నాయకులు మౌన దీక్ష నిర్వహించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42% రిజర్వేషన్ల సాధనకు ఇది భాగమని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న జీవో నంబర్ 9ను బీసీ బిల్లు రూపంలో చట్టసభల్లో ఆమోదించి, గవర్నర్, రాష్ట్రపతి వద్ద రాజముద్ర కోసం పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాజ్యాంగ సవరణ ద్వారా బిల్లులను ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో చేర్చి శాశ్వత పరిష్కారం చూపాలని బీసీ సంఘం డిమాండ్ చేసింది. జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ చల్లేటి భాస్కరాచారి, వరికుప్పల ఆర్మీ శ్రీను, అప్పం వీరయ్య, డాక్టర్ భాషా చౌహన్, రంజాన్ బేగ్, పెరికేటి శ్రీనివాసాచారి, భీమగోని శివ గౌడ్, రెడ్డి యాదయ్య, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు రోజుకూలీ 800 ఇవ్వాలి: ఎస్. మల్లేష్

**అమ్రాబాద్, నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమ్రాబాద్ మండలం ప్రశాంత్‌నగర్ గ్రామపంచాయతీలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా నాయకుడు ఎస్. మల్లేష్ మాట్లాడుతూఉపాధి కూలీలకు రోజుకూలీ 800 ఇవ్వాలని, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, 1948 కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కూలీలకు సంవత్సరానికి 12,000, నిరుపేద మహిళలకు 2,500 ఇవ్వాలని హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఆ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నా, కూలీల కూలీ పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 57 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యవసాయ కూలికి 5,000 పింఛన్ ఇవ్వాలని, ప్రమాదాల్లో లేదా ఇతర కారణాలతో మరణించిన వారికి 10 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందన లేకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి. భాగ్యమ్మ, ఇదమ్మ, గెలవయ్య, బాలమ్మ, రజిత, బాలయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





## ఆమనగలులో ఘనంగా గార్మి షరీఫ్ వేడుకలు



**ఆమనగల్లు, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పీర్ల మసీద్ కాలనీలోని మహబూబ్ సుభాని దర్గా వద్ద గార్మి షరీఫ్ వేడుకలను అంజుమనే గులామే ముస్తఫా కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా వద్ద నుండి పట్టణంలో జెండాతో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో జెండా ప్రతిష్టించి మత గురువు ఆఫీస్ మౌలానా వాహేద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు, సలాం, దువా చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో జామియా మజీద్ అధ్యక్షులు మొహమ్మద్ మాసూమ్, మైనార్టీ సోదరులు అలీబేగ్, చోటే బేగ్, జబ్బార్, బాబా షర్ఫుద్దీన్, సయ్యద్ ఖలీల్, నయీం, రజాక్, అఫ్జల్, షఫీ ఉల్లా, ఎజాస్, అలీమ్, కలీం, అఫ్సర్, హాఫీజ్, నాసర్ తదితరులు పాల్గొన్నారు. అంజుమనే గులామే ముస్తఫా కమిటీ సభ్యులైన అక్రమ్ బేగ్, బాబా, అజహర్, అబ్బాస్, అమీర్ పాషా, అసద్, అంజద్, సోహెబ్, సోహెల్, గౌస్, రావుఫ్, పాషా, ముధసిర్, ముజంమిల్, ఆబేద్, ముబాషిర్, రిజ్వాన్ తదితరులు సేవలందించారు.

# పీఆర్సీ అమలు చేయాలి

### టిపిటిఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, ఉపాధ్యక్షులు పి.నారాయణమ్మ, డి.శ్రీనివాస్, ఎం.లక్ష్మయ్య యాదవ్, బి.రాజు, కార్యదర్శులు ఆత్రం భుజంగరావు, రావుల రమేష్, ఎస్.విజయ్, దామెర రాజయ్య, సిద్దోజు కవితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతిపాదనల ఆధారంగా రూపొందించిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు తాత్కాలిక బదిలీలకు సంబంధించిన 190 జీవోలో మార్పులు చేయాలని, క్రమబద్ధీకరణ జీవో 25 నిబంధనలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గిరిజన సంక్షేమ శాఖ చొరవ తీసుకోవాలని, నవంబర్, డిసెంబర్‌లో మూడు దశల పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తరగతుల సమయంలో వృత్యంతర శిక్షణలు నిలిపివేసి వేసవి సెలవుల్లో నిర్వహించాలని సూచించారు. అర్హతలేని అధికారులను జిల్లా విద్యాధికారులుగా నియమించడాన్ని ఖండించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాలను విడుదల చేయాలని, గురుకుల, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ఎయిడెడ్ టీచర్లను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.




# న్యాయ సేవ జాతీయ దినోత్సవం





**దేవరకొండ నవంబర్ 09. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** న్యాయసేవ జాతీయ దినోత్సవం పురస్కరించుకుని దేవరకొండ న్యాయస్థానం లో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె అనిత ఆధ్వర్యంలో న్యాయస్థానం నుండి ర్యాలీగా బయలుదేరి దేవరకొండలోని మహాలక్ష్మి వృద్ధాశ్రమంలో వృద్ధులకు సంబంధించిన వారి యొక్క హక్కులు విధివిధానాల గురించి, సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 గురించి సీనియర్ సివిల్ జడ్జ్ న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె అనిత తెలియపరచారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గాజుల ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నాయిల ఉమామహేశ్వర్, న్యాయవాదులు కర్నాటి సురేష్, ఎండి షౌకత్ అలీ, మాడం రాములు, వనం జగదీశ్వర్, వసుకుల శ్రీను, చేనగాని అశోక్, ఎండి రియాజుద్దీన్, సబావత్ శ్రీకాంత్, జున్ను ఇద్దయ్య, బోలె సాయి, శంకర్, గణేష్, మంజునాథ్, అల్వాల్ రెడ్డి మరియు దేవరకొండ ఎస్సై నారాయణ రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన జూనియర్స్ చెస్ ఛాంపియన్షిప్

**కరీంనగర్, నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కోతిరాంపూర్‌లోని అన్నమనేని గార్డెన్స్‌లో విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్స్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ విషయాన్ని అకాడమీ డైరెక్టర్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కి ఫార్చ్యూన్ మెడికేర్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య సహకారం అందించగా, సీఈవో ఆర్.ఎస్.పి. రెడ్డి తొలిఎత్తు వేసి ప్రారంభించారు. చెస్ మేధస్సును పెంపొందించే క్రీడ అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఫార్చ్యూన్ మెడికేర్ డాక్టర్ల బృందం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించింది. నిర్వాహకులు విశ్వనాథ్ ప్రసాద్, సమాఖ్య బాధ్యులు అంతగిరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూవివిధ జిల్లాల నుండి సుమారు 150 మంది క్రీడా చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, స్విస్ లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించామని తెలిపారు. అండర్-10, అండర్-12, అండర్-14, అండర్-18 కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్న వారికి టాబ్స్, సైకిల్స్, స్మార్ట్ వాచ్లు బహుమతులుగా అందించగా, యంగెస్ట్ ప్లేయర్లకు స్కూల్ బ్యాగులు అందజేశారు. బహుమతి ప్రధానోత్సవంలో డాక్టర్ శ్రీనివాస్, జార్జి రెడ్డి, మారుతి రామన్ పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌కి చీఫ్ ఆర్బిటర్‌గా మార్క్ అనిల్, ఆర్బిటర్లుగా కొప్పర్తి శివయ్య, కొప్పర్తి శంకర్, ముక్క సౌజన్య, గుర్రం కీర్తి, భవాని వ్యవహరించారు.





## జూబ్లీహిల్స్ బీసీ అభ్యర్థికి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపు కోరుతూ బీసీ జేఏసీ విజ్ఞప్తి



**మిర్యాలగూడ, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీసీ, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరుతూ మిర్యాలగూడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీసీ జేఏసీ కో కన్వీనర్ దాసరాజు జయరాజు, చేగొండి మురళీ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో 42 శాతం, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుతోనే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీ అభ్యర్థి గెలుపు ద్వారా బీసీ హక్కుల సాధనకు బలమైన సందేశం వెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, సూర్యాపేట జిల్లా మోకుదెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపల్లి రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ హెచ్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షులుగా తక్ధీర్ అలీ నియామకం



**పెద్దపల్లి,నవంబర్ 10 (నీలగిరిఎక్స్ ప్రెస్):** అసోసియేషన్ ఫర్ పబ్లిక్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా మహమ్మద తక్ధీర్ అలీని నియమించినట్లు ఏ పి హెచ్ ఆర్ సి ఫౌండర్ అండ్ చైర్మన్ నడిమింటి చంద్రకళ రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడం, పలు సేవా కార్యక్రమాల్లో తక్ధీర్ ముందుండడంతో పాటు, చేస్తున్న సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా తక్ధిర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడం తనపై మరింత భారం పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఏపీ హెచ్ఆర్సీ సంస్థను బలోపేతం చేయడంతో పాటు పేద, మధ్య తరగతి ప్రజలు, యువత, వయోవృద్ధులు పడుతున్న సమస్యలను ప్రభుత్వం, అధికార, అనధికారుల, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన అసోసియేషన్ ఫౌండర్ చైర్మన్ చంద్రకళా రెడ్డికి, అసోసియేషన్ నేతలు, సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మైసిగండికి పోటెత్తిన భక్తజనం

-మైసమ్మ తల్లికి బోనం.. వైభోగం
-కొనసాగుతున్న ఉత్సవాలు





**కడ్తాల్, నవంబర్ 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ అమ్మవారి ఉత్సవాలు అదివారంతో ఇదో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్ పర్సన్ సిరోలి పంతు, ఈఓ శ్నేహలత, తహశీల్దార్ జ్యోతి, శ్రీరాములు, అమృ నాయక్, పాండు నాయక్, జావర్ లాల్, లింగప్ప, భాస్కర్, అరుణ్, ఉప ప్రధాన అర్చకులు యాదగిరి, పూజారులు అమూల్యపాటి, సంతోష్ శర్మ, వెంకటరమణ, బిచ్యా నాయక్, శ్రీరాములు, ఆలయ సిబ్బంది కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్, వెంకటేష్, రవి, భక్తులు పాల్గొన్నారు.

## పాలకేంద్ర పునరుద్ధరణకు పాల క్యాన్ల పంపిణీ



**కరీంనగర్, నవంబర్ 9(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో గద్దపాక డెయిరీ సభ్యులకు పాల క్యాన్ల పంపిణీ కార్యక్రమం నవంబర్ 9న నిర్వహించారు. డైరీ చైర్మన్ రాజేశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళల ఆధ్వర్యంలో పాలకేంద్రం నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గతంలో మూలపడ్డ పాలకేంద్రాన్ని మళ్లీ ప్రారంభించి, మహిళల ఆధ్వర్యంలో పాల సేకరణ కొనసాగిస్తూ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహిస్తున్న పాలకవర్గాన్ని చైర్మన్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాలకేంద్ర అధ్యక్షురాలు జక్కుల పద్మ, నిర్వాహకులు పలకల శ్యాంసుందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**హుజురాబాద్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ గేయం వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం సంవత్సరం పాటు వేడుకలు నిర్వహిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఈ నెల 13న గురువారం అంబేద్కర్ చౌరస్తా, హుజురాబాద్‌లో వందేమాతర గీతాలాపన కార్యక్రమం జరుగనుంది .ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు మాట్లాడుతూ వందేమాతరం ఒక మంత్రం, శక్తి, స్వప్నం, సంకల్పమని ప్రధాని మోడీ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరంలో వందేమాతరం బలమైన గళంగా నిలిచిందని, నేటి సైనికులు కూడా ప్రతి సందర్భంలో వందేమాతరం నినదిస్తారని తెలిపారు. పరాయి పాలనలో మగ్గుతున్న సమయంలో బకిన్ చంద్ర చటర్జీ ఈ గేయాన్ని రచించి దేశ పునర్వైభవాన్ని కలగన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాలు, కుల సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, యువత, హుజురాబాద్ ప్రజలు భాగస్వాములై దేశభక్తిని చాటాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, సీనియర్ నాయకులు తిప్పబత్తిని రాజు, అంకతి వాసు, గంట సంపత్, కొడిమ్యాల పవన్ కుమార్, కొలిపాక వెంకటేష్, భాస్కర్ యాదవ్, క్యాస వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సామాజిక సేవకు హనుమాన్ రాథోడ్‌కు అవార్డు




**మాడుగుల, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నర్సంపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, మానస క్యాటరర్స్ ఫౌండర్ శ్రీ హనుమాన్ రాథోడ్‌కు ఉత్తమ సామాజిక సేవ చేసినందుకు ప్రగతి ఫౌండేషన్ మరియు వల్లూరి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవా అవార్డు ప్రదానం చేశారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పూజ్యులు దైవాజ్ఞ శర్మ, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసులు గారి చేతుల మీదుగా అవార్డు అందించారు. ఈ సందర్భంగా హనుమాన్ రాథోడ్ గారు అవార్డు అందుకున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తూ, సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రోత్సహించిన ఫౌండేషన్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## జూబ్లీ హిల్స్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

-నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**కడ్తాల్, నవంబర్ 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ ముఖ్య నేతలు, అదివారం జూబ్లీ హిల్స్ లో నవీన్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించామని చేతి గుర్తుకు అత్యధిక ఓట్లు వేసి నవీన్ యాదవ్ గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



**మహబూబాబాద్, నవంబర్ 9(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మహబూబాబాద్ పట్టణ పరిధిలో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలలో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించిన ఆయన, ప్రతి వాహనదారుడూ తమ వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై ప్రతిరోజూ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ప్రశాంత్ బాబు, ఏఎస్ఐ చక్రపాణి, ఇతర పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## హమాలీలకు కూలీ పెంచకుంటే ఆందోళన: ఎం.ఎ.గౌస్




**గోదావరిఖని, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచకుంటే నవంబర్ 12 తర్వాత ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే సమ్మెకు పిలుపునిస్తామని ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్ హెచ్చరించారుఆదివారం జరిగిన హమాలీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూగత మూడు సంవత్సరాలుగా కూలీ పెంపు కోరుతున్నా వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ leaders స్పందించలేదని విమర్శించారు. హమాలీలను అవమానిస్తూ, శ్రమ దోపిడీ, ఆర్థిక దోపిడీ జరుగుతోందని మండిపడ్డారు. ఈ అంశంపై లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నవంబర్ 12న కరీంనగర్‌లో కమిషనర్ సమక్షంలో వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్, హమాలీ వర్కర్స్ యూనియన్ మధ్య సమావేశం జరుగనుందని, అందులో కూలీ పెంపుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేకపోతే మార్కెట్ బంద్‌తో సహా తీవ్ర ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గాలిపెల్లి సతీష్, రాంచందర్, జానీమియ, బండారి రవి తదితరులు పాల్గొన్నారు.

## తండా వాసికి డాక్టరేట్

- గిరిజన సమాజానికి గర్వకారణం



**హుస్నాబాద్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట జిల్లా అక్కనపేట మండలం పంజాగుట్ట తండాకు చెందిన గుగులోతు తిరుపతి నాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి "తెలంగాణ బంజారా అనుబంధ సాహిత్యం"పై పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. మారుమూల తండా ప్రాంతం నుండి పేద, బడుగు, బలహీన వర్గానికి చెందిన ఆయన సాధించిన ఈ విజయం బంజారా సమాజానికి గర్వకారణంగా నిలిచింది. తిరుపతి నాయక్ సాధన పట్ల తండా యువత హర్షం వ్యక్తం చేస్తూ, బంజారా సంస్కృతి, భాష, కట్టు బొట్టు గౌరవాన్ని నిలబెట్టిన ఆయనకు సన్మానం నిర్వహించారు. ఈ విజయంతో గ్రామీణ, గిరిజన యువతలో ఉన్నత విద్యపై అవగాహన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుగులోతు రాకేష్ నాయక్, వెంకటేష్ నాయక్, పరశురామ్ నాయక్, కుమార్, అంజన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవం సందర్భంగా బాలమిత్ర అవార్డుల కార్యక్రమం



**హుస్నాబాద్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మినీ రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు.సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూచిన్నారి విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దేశభక్తి పాటలు, భరతనాట్యం, గిటార్, కీబోర్డు, ఫ్లూటు, యోగా, చిత్రలేఖనం, జానపద నృత్యం, మిమిక్రీ, మ్యాజిక్, క్రీడలు, కళలు, శిబిరాలు తదితర రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో గవ్వ కమలమ్మ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు గవ్వ వంశీధర్ రెడ్డి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంట అజయ్ పటేల్, బాలల హక్కుల ప్రజా వేదిక జిల్లా నాయకులు వేముల శ్రీనివాస్, పొలవేణి కుమారస్వామి, సముద్రాల ఓంకార్, మూల ప్రభాకర్ రెడ్డి, బట్టు రాజిరెడ్డి, కందుకూరు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోకపోతే పోరాటం తప్పదు: మల్లికార్జున రెడ్డి



**హుస్నాబాద్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్కనపేట మండలం పెద్దతండాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూమొంథ తుపాన్ ప్రభావంతో హుస్నాబాద్ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసి వరి, పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నష్టపోయాయని తెలిపారు. రైతులు పెట్టుబడులు పెట్టి తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి 40,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలోనూ నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పి తప్పించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కనీసం ఇప్పుడైనా మాట నిలబెట్టుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించాల్సిన సమయంలో అనేక నిబంధనలు పెట్టి, ఆలస్యంగా వచ్చి, తుతుమాత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రైతుల పట్ల నిజమైన ప్రేమ ఉంటే ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, లేకపోతే బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటానికి దిగుతుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుగులోతు రాజు నాయక్, సకృ నాయక్, బొడ్డు రాజు, కుమార్, భీమా నాయక్, రాంచంద్రర్ నాయక్, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మైసిగండి మైసమ్మ తల్లిని దర్శించుకున్న సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు చెసిన సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్



**కడ్తాల్, నవంబర్ 9 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ అమ్మవారిని ఆదివారం సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతి నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబు నాయక్, రాష్ట్ర నాయకులు మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మైసిగండి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రామావత్ లక్ష్మీసిరోలి పంతు నాయక్, వారి కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. గిరిజనుల హక్కుల సాధనకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్త్యావత్ రేఖ్య నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాత్లవత్ రవి నాయక్, అరుణ్ నాయక్, రమావత్ భాస్కర్ నాయక్, జర్పుల లక్ష్మణ్ నాయక్, సీతారాం నాయక్, నాగేష్ నాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో సంపత్‌లు ముందుండాలి



**హుస్నాబాద్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సమాజ రుగ్మతలపై పోరాడుతూ సంపత్‌లు సామాజిక సేవలో ముందుండాలని సంపతుల సేవాసమితి గ్రూప్ అడ్మిన్ ముక్కెర సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భారత్ పబ్లిక్ స్కూల్‌లో హుస్నాబాద్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందిన ఈ రోజుల్లో "సంపత్" అనే పేరుతో ఏర్పాటైన గ్రూపు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. త్వరలో భారీ స్థాయిలో రక్తదాన శిబిరం నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న వారికి సహాయం చేయనున్నట్లు చెప్పారు. గంజాయి బారిన పడుతున్న యువత నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మేడారం సమ్మక్క జాతరలో వాలంటీర్లుగా సేవలందించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో నీలం సంపత్ యాదవ్, రేపాక సంపత్ రెడ్డి, భూక్య సంపత్ నాయక్, ఎలగందుల సంపత్, బొంగోని సంపత్, బొడుమల్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**కమాన్‌పూర్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇందిరా క్రాంతి పథకం (ఐకెపి) ఆధ్వర్యంలో సోమవారం కమాన్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైరాల రాజు, ఐకెపి ఎపిఎం పద్మ ఈ విషయాన్ని తెలిపారు.ఉదయం 9 గంటలకు ముల్కలపల్లి, 9:45కు కమాన్‌పూర్, 10:30కు రాజాపూర్, 11:00కు గుండారం, 11:45కు పేరాపల్లి, మధ్యాహ్నం 12:30కు నాగారం, 1:00కు సిద్ధిపల్లె గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## ఉపాధ్యాయ కుటుంబాలకు రక్షణ కవచం పిఆర్టియు: బిక్షం గౌడ్



**నల్లగొండ, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హార్ట్ ఎటాక్‌తో ఇటీవల మరణించిన ఉపాధ్యాయుడు దయాకర్ (ఎస్జీటీ) కుటుంబాన్ని పిఆర్టియు-టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ పరామర్శించి, ఒక లక్ష రూపాయల చెక్కును అందించారు. సంఘ సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయులకు పిఆర్టియు అండగా ఉంటుందని, భరోసా కలిగిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాలం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, గౌరవ అధ్యక్షులు సత్తయ్య, పంచాయతీ రాజ్ మాసపత్రిక సబ్ ఎడిటర్ గాదే వెంకట్ రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా సభ్యులు మహమ్మద్ ఫరీద్, జిల్లా మాజీ అధ్యక్షులు ఫణి కుమార్, మండల అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రవూఫ్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, పిఆర్టియు-టీఎస్ బాద్యులు, సభ్యులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న అచ్చంపేట బీఆర్ఎస్ శ్రేణులు




**అచ్చంపేట, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఆదివారం రహమతు నగర్ డివిజన్‌లోని సంతోష్ గిరి, బంగారం మైసమ్మ బస్తీలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గారితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ మాజీ శాసనసభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూబీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట అచ్చంపేట బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ కోర్ర వంశీ, కేటీఆర్ సేవాసమితి అధ్యక్షులు అంకు సురేందర్, మున్సిపల్ కౌన్సిలర్ శివ రమేష్ రావు, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ప్రచారంలో శ్రీనివాస్ గౌడ్, జూపల్లి భాస్కరరావు



**చారకొండ, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం చారకొండ మండలంలోని జూపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూమాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలే మాగంటి సునీతను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.కార్యక్రమంలో జూపల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ జగపతి, ఎస్.కె తాజ్ భాయ్, రాంపురం విజయ్, యువసేన అధ్యక్షులు ఎండి సిరాజ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ప్రచారంలో పాల్గొన్న కల్వకుర్తి కాంగ్రెస్ నాయకుల



**కల్వకుర్తి, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచార కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారుఈ సందర్భంగా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి అనుసరిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు నవీన్ యాదవ్ గెలుపుకు బలమైన ఆధారమవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు వెంకటగిరి మండలంలోని అన్ని బూత్‌లలో మెజారిటీ సాధించగలమన్న ధీమా వ్యక్తం చేశారు. విజయానికి అండగా నిలిచిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గుర్రం కేశవులు, గాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

**మిడ్జిల్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ,ఈ వేడుకలలో, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు నాయకులు పాల్గొన్నారు.

# అమరుల ఆశయ సాధనకు విప్లవ పోరాటం అవసరం: కె. రాజన్న




**పెద్దపల్లి, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిపిఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సభకు ముందు విప్లవోద్యమంలో అమరులైన వీరుల స్మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె. రాజన్న మాట్లాడుతూభూమికోసం, భుక్తికోసం, ప్రజా విముక్తికోసం పోరాడిన అమరుల ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని, పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన విప్లవ పోరాటాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ, ఫాసిస్టు విధానాలను బలపరిచే కేంద్ర ప్రభుత్వాన్ని, ఆరోగ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, కొల్ల వెంకయ్య, చారుమంజుందర్, పొట్ల రామనర్సయ్య, నీలం రామచంద్రయ్య వంటి విప్లవ వీరుల త్యాగాలను గుర్తు చేస్తూ, వారి ఆశయ సాధనకై ప్రజాయుద్ధ పంథాలో ప్రజారాజ్య నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. సభకు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ. నరేష్ అధ్యక్షత వహించగా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ. కృష్ణ, సహాయ కార్యదర్శి ఏ. వెంకన్న, పీ.ఓ.డబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే. జ్యోతి, పార్టీ జిల్లా నాయకులు బి. అశోక్, చిలుక శంకర్, ఈదునూరి రామకృష్ణ, ఐ. రాజేశం, మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేష్, డి. బుచ్చమ్మ, ఎం. దుర్గయ్య, కొండ్ర మొగిలి, ఎడ్ల రవికుమార్, ఆర్. రాయమల్లు, బండ పద్మ, ఎం. కొమరయ్య, ఈ. బాబు, ఎం. తిరుపతి, ధర్మేందర్, టి. రాయమల్లు, ఎన్. రాజేందర్, ప్రసాద్, శేఖర్, గడ్డి రాజు, దుర్గం పోశం, లింగయ్య, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు. సభకు సుమారు 100 మంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు హాజరయ్యారు.

## సింగరేణి బస్ స్టాండ్ ప్రజల కోసమా? పార్కింగ్ కోసమా?



**మంథని, నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మంథని పట్టణంలో సింగరేణి నిధులతో నిర్మించిన కొత్త బస్ స్టాండ్ ప్రజల వినియోగానికి కాకుండా వాహనాల పార్కింగ్, వ్యాపార అవసరాలకే పరిమితమైపోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం అని చెప్పి కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ సదుపాయాలు ఇప్పటికీ ప్రయాణికులకు అందుబాటులోకి రాకపోవడం సిగ్గుచేటని బీజేపీ నాయకులు, ఎంపీటీసీ ఫోరం మాజీ జిల్లా అధ్యక్షులు మొల్మూరి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత బస్ స్టాండ్ కూల్చివేయడంతో అక్కడ ఉన్న టాయిలెట్లు తొలగిపోయాయి. ఫలితంగా మహిళలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త బస్ స్టాండ్ నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం వెనుక ఏ ఉద్దేశముందో ప్రజలకు అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రజల అవసరాలకన్నా వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. బస్ స్టాండ్‌ను తక్షణమే ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని, నాలుగు టాయిలెట్లు వెంటనే ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అలాగే మంథని డిపో అధికారులతో చర్చించి అన్ని బస్సులు కొత్త బస్ స్టాండ్ వద్దే ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సౌకర్యాలే లక్ష్యంగా నిర్మించిన సదుపాయాలు ప్రజలకే అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## సిపిఐ శతాబ్ది సభను విజయవంతం చేయాలి

తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు




**మహబూబాబాద్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించే శతాబ్ది ఉత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూదేశంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. మావోయిస్టులు సాయుధ పోరాటం ద్వారా విప్లవం సాధించడం అసాధ్యమని, ఉద్యమ బాటలో కమ్యూనిస్టు పార్టీలతో కలసి పనిచేయాలని సూచించారు. ఈ సభకు పలు దేశాల నుంచి, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు కళాజాతలతో విస్తృత ప్రచారం నిర్వహించి ఐదు లక్షల మందిని సభకు తరలిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మంత్రులు అంతర్గత విభేదాలు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం సిపిఐ కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, సహాయ కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, అజయ్ సారథి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కొండగట్టు జేఎన్టీయూలో ర్యాగింగ్ ఘటనపై విచారణ జరిపించాలి: జక్కనపల్లి గణేష్



**కరీంనగర్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాచుపల్లి శివారులోని కొండగట్టు జేఎన్టీయూ క్యాంపస్‌లో సీనియర్ విద్యార్థులు బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ చేసిన ఘటనపై యూనివర్సిటీ, పోలీస్ అధికారులు తక్షణ విచారణ జరిపించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, యువ న్యాయవాది జక్కనపల్లి గణేష్ డిమాండ్ చేశారు. ఇద్దరు జూనియర్ విద్యార్థుల చేత పెళ్లి తంతు జరిపించి, చున్నీలు వేసుకుని డ్యాన్స్ చేయించి, ఆ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఘటనపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. క్యాంపస్ సెక్యూరిటీ చీఫ్ విద్యార్థులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అతనిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అడ్మినిస్ట్రేషన్ విఫలమవడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటూ, యాంటీ ర్యాగ్గింగ్ కమిటీని పటిష్టంగా ఏర్పాటు చేసి, ర్యాగ్గింగ్‌ను పూర్తిగా నిరోధించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## గోల్డ్ మెడల్ అందుకున్న హాస్య రెడ్డికి ఘన సన్మానం



**కమాన్‌పూర్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గారి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్న కదారి హాస్య రెడ్డికి లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ఉపాధ్యక్షులు లయన్ కదారి కళాధర్ రెడ్డి తన కుమార్తె హాస్య రెడ్డి సాధించిన ఈ ఘనతను గర్వంగా పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో ఆమె చూపిన ప్రతిభ రామగిరి మండలానికి గర్వకారణమని క్లబ్ అధ్యక్షుడు లయన్ మేకల మారుతి యాదవ్ అన్నారు. యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని, హాస్య రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని లయన్స్ తరపున ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమంలో ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ మొల్మూరి శ్రీనివాస్, డైరెక్టర్లు గంట వెంకటరమణ రెడ్డి, టీవీ సురేష్ బాబు, సభ్యులు అసం తిరుపతి, తీగల శ్రీధర్, చందు చారి తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో త్రిముఖ పోటీ: ఈటల రాజేందర్



**మల్కాజ్గిరి, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో త్రిముఖ పోటీ నెలకొనబోతుందని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ఓ అభ్యర్థి సానుభూతితో ఓట్లు అడుగుతుండగా, మరొకరు అధికార దాహంతో ప్రజలను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారుఈ రెండు ధోరణులకు మధ్య న్యాయం, ధర్మం కోసం బీజేపీ పోరాడుతోందని తెలిపారు. బీజేపీ ఎప్పుడూ లోపాయకారీ ఒప్పందాలకు దూరంగా ఉంటుందని, ప్రజలకు ఏం చేస్తామో చెప్పాలే కానీ పరస్పర విమర్శలతో ప్రయోజనం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసానికి ప్రతిరూపమని, గతంలో ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే గల్లీలు బాగుపడతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు డబ్బు అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరికి ఓటు వేయాలనేది ప్రజలే నిర్ణయిస్తారని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## ఘనంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పుట్టినరోజు వేడుకలు



**భూపాలపల్లి, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఎమ్మెల్యే చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. షేక్‌పేట డివిజన్ కాంగ్రెస్ నాయకులు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని, ఆయన మరెన్నో పుట్టినరోజులు ప్రజాసేవలో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## జూబ్లీహిల్స్ ప్రజలు మార్పు కోసం సిద్ధంగా ఉన్నారు: భరత్ ప్రసాద్



**కల్వకుర్తి, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం శ్రీనగర్ కాలనీలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ ప్రజలతో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదేశ అభివృద్ధి, రాష్ట్ర పురోగతికి బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రజలలో మార్పు కోసం ఉన్న తహతహ స్పష్టంగా కనిపిస్తోందని, బీజేపీ చేపట్టిన అనేక కార్యక్రమాలు ప్రజల మద్దతు పొందుతున్నాయని తెలిపారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని గెలిపించి బీజేపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ప్రపంచ ఉర్దూ దినోత్సవం



**నల్లగొండ నవంబర్ 9 (నీలగిరి ఎక్స్ ప్రెస్** కవి, తత్వవేత్త సర్ డా. అల్లామా ఇక్బాల్ 148వ జయంతిని పురస్కరించుకుని నల్గొండలోని ప్రకాశం బజార్ ఇక్బాల్ సెంటర్లో ఆదివారం ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జి. మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉర్దూ మీడియంకు చెందిన 15మంది విద్యార్థులకు మొమెంటోలు అందజేసిన స్థానిక నాయకులు.

## కరీంనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం



**కరీంనగర్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఏసీ, రిఫ్రిజరేషన్, వాషింగ్ మిషన్ రంగాల్లో సేవలందిస్తున్న టెక్నీషియన్లకు సమన్వయ వేదికగా ఏర్పాటైన కరీంనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు ఆదివారం రోజున ఘనంగా జరిగాయి. మంకమ్మ తోటలోని బ్లూ స్టార్ ఏసీ షోరూంలో నిర్వహించిన సమావేశంలో జిల్లావ్యాప్తంగా ఉన్న టెక్నీషియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఎన్నికల అధికారిగా శ్రీ బీమా సాహెబ్ బి.ఎస్.సి, ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎం (అడ్వకేట్) బాధ్యతలు నిర్వహించారు. సభ్యుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లీగల్ అడ్వైజర్‌గా శ్రీ జి. భీమ సాహెబ్ అడ్వకేట్ నియమితులయ్యారు. అధ్యక్షులుగా బ్లూ స్టార్ ఎండి సలీముద్దీన్, గొల్లపల్లి సత్యనారాయణ గారు బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా బాబురావు, రాచకొండ సంతోష్, కె. జనార్ధన్, స్కె. జావిద్ పాష గారు ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎండి ఖలీల్, కార్యదర్శిగా మమ్మద్ రఫీక్ అహమ్మద్ బాధ్యతలు చేపట్టారు.సహకార్యదర్శులుగా ఎండి తాజ్ బాబా, ఎండి బాబా, ఎండి అయూబ్ ఖాన్, మొహమ్మద్ రఫొద్దీన్ ఎంపికయ్యారు. కోశాధికారిగా కొండమీది తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులుగా ఎండి సాధిక్, ఇన్న రెడ్డి, నాని తదితరులు ఎన్నికయ్యారు. మొత్తం 60 మంది టెక్నీషియన్లు ఈ సమావేశంలో పాల్గొని సంఘ ఐక్యతకు మద్దతు తెలిపారు.

## అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



**మిర్యాలగూడ, నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ బొంగరాల వెంకన్న గారి స్మృతికి అంకితంగా ఏర్పాటు చేసిన స్తూపావిష్కరణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగన్న పాల్గొని, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేషన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, జిల్లా కమిటీ సభ్యులు చౌగాని సీతారాములు, మండల నాయకులు, శాఖ సభ్యులు, బొంగరాల వెంకన్న గారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తి పరవశంలో ఆకెనపల్లి



**రామగుండం, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆకెనపల్లి గ్రామంలో భూలక్ష్మి -మహాలక్ష్మి బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని దాతలు గాదె స్రవంతి–సుధాకర్ దంపతులు నిర్వహించారు.పూజా కార్యక్రమంలో పాల్గొన్న మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ మాట్లాడుతూ "మన గ్రామ దేవతలు కేవలం భక్తి ప్రతీకలు మాత్రమే కాదు, మన గ్రామాల ఆత్మ, మన సంస్కృతికి ప్రాణం. ప్రతి ఇంటిలో శాంతి, సౌభాగ్యం, సుభిక్షం నెలకొనాలని భూలక్ష్మి అమ్మ ఆశీర్వదించమని ప్రార్థించాను" అని పేర్కొన్నారు.భక్తి, సేవ, సామాజిక బాధ్యతలే తమ సంస్థ బలమని, ప్రతి కార్యక్రమం వెనుక ప్రజల శ్రేయస్సే ధ్యేయమని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల కార్తీక వనభోజనాలు



**కరీంనగర్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం మాత మాణిక్యేశ్వరి ఆలయంలో కరీంనగర్ బార్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ న్యాయవాది కాచం రమేష్ ఆధ్వర్యంలో ఉసిరి చెట్టు క్రింద వనభోజనాలు నిర్వహించారు. ముందుగా చెట్టుకు పూజలు చేసి అయ్యగారి ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో పీవీ రాజ్ కుమార్, చక్రధర్, శ్రీనివాస్, శ్రావణ్, జె. శ్రీరాములు, కొత్త ప్రకాశ్, పవన్, రామకృష్ణ, శివ కుమార్, మహేందర్, బి. స్వామి, సతీష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ బైక్ ర్యాలీకి ఉత్సాహభరిత స్పందన



**పెద్దపల్లి, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచార ముగింపు సందర్భంగా షేక్‌పేట్ డివిజన్ పరిధిలోని టోలిచౌకి, సూర్యనగర్, ఆదిత్యనగర్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు ఓటు వేయాలని ప్రజలను కోరుతూ నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమైన దాసరి మనోహర్ రెడ్డి, ప్రతి ఓటు విలువైనదని, బూత్‌ల వద్ద గట్టిగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమైందని, మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, హైడ్రా పేరిట ఇండ్ల కూల్చివేతలు, తప్పుడు వాగ్దానాలు కాంగ్రెస్‌కు నష్టం కలిగిస్తాయని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్‌కు చెంపపెట్టు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 46 గుళ్ల కూల్చివేతపై హిందూ సమాజ ఆవేదన



**గోదావరిఖని, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గోదావరిఖని పట్టణంలో అర్ధరాత్రి సమయంలో గ్రామదేవతలు మైసమ్మ, వేలుపమ్మ, పోచమ్మ అమ్మవార్ల గుళ్లు సహా మొత్తం 46 గుళ్లు కూల్చివేయడం హిందూ సమాజంలో తీవ్ర ఆవేదనకు దారి తీసింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ చర్యపై హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.రామగుండం బీజేపీ ఇంచార్జి కందుల సంధ్యారాణి గారు పాల్గొని, జీఎం కాలనీ, రామ్‌నగర్, విద్యానగర్, గాంధీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో కూల్చిన దేవాలయాల వద్ద శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవార్లకు కోడిమొక్కలు చెల్లించి, ప్రజలకు ఎటువంటి ఆపదలు కలగకుండా కాపాడమని భక్తి భావంతో ప్రార్థించారు.ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ"హిందూ ఆరాధనా స్థలాలను కూల్చివేయడం అత్యంత ఘోరమైన చర్య. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్యలను ఇక సహించము" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ముస్కుల భాస్కర్ రెడ్డి, పిడుగు కృష్ణ, మచ్చ విశ్వాస్, బండారి శ్యాం కుమార్, బియ్యాల మహేందర్, జక్కన బాలు, జక్కుల ప్రవీణ్, పద్మ, గుండెబోయిన గట్టయ్య, చిందాం భాస్కర్, జనగామ శివరామ్, ఇరుగురాల శివ, కొమురవెల్లి విశ్వనాథ్, అందె రాజ్ కుమార్ చారి, మీస వికాస్, బుంగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఐటీయూ జిల్లా మహాసభలు ప్రారంభం




**కరీంనగర్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోతి రాంపూర్‌లో సీఐటీయూ 11వ జిల్లా మహాసభలు జయప్రదంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, జే. వెంకటేష్, పద్మశ్రీ, రామ పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ గత మూడేళ్ల ఉద్యమాల నివేదికను ప్రవేశపెట్టి, ఆశా, బిల్డింగ్, హమాలీ, గ్రానైట్, రైస్ మిల్లు రంగాల్లో చేసిన కృషిని వివరించారు. నివేదికపై 32 మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, ఉపాధ్యక్షులు యు. శ్రీనివాస్, రాజమల్లు, సహాయ కార్యదర్శులు శంకర్, శ్రీలత, పూన్నం రవి, కోశాధికారి రాజేశం, రాష్ట్ర విద్యుత్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాలువల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వార్షికోత్సవం సందర్భంగా సీలింగ్ ఫాన్స్ వితరణ



**కరీంనగర్, నవంబర్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన పూర్వ అధ్యక్షులు లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, లయన్ లేడీ లక్ష్మి దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రేకుర్తిలోని విశ్వబ్రాహ్మణ సంఘ భవనానికి రెండు సీలింగ్ ఫాన్స్‌ను విరాళంగా అందించారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ ననువాల గిరిధర్ రావు మాట్లాడుతూ, సమాజ అవసరాలను గుర్తించి సేవ చేయడం ద్వారా జీవితం మరింత తృప్తికరంగా మారుతుందని, అందుకే క్లబ్ సభ్యుల పుట్టినరోజులు, పెళ్లిరోజులను సేవా కార్యక్రమాలుగా మార్చుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమంలో కార్యదర్శి లయన్ పాశం నర్సింహా రెడ్డి, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ లయన్ మానువాడ శంకర్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ చిలుపూరి రాములు, థర్డ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ మమత వేణు, డైరెక్టర్లు లయన్ వూట్ల దేవయ్య, ఉదారం వెంకటస్వామి, రామకృష్ణ, రవీంద్ర చారీ, వామనాచారీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ విషయంపై మందలింపు


### - విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**మహబూబాబాద్, నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లా ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని ప్రేమ విషయంపై తల్లి దండ్రుల మందలింపుతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 31న విద్యార్థిని ఆశ్రమ పాఠశాలలో కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి తాగింది. వెంటనే స్పందించిన పాఠశాల సిబ్బంది ఆమెను మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.ఈ ఘటనపై ఐటీడీఏ పి.ఓ విచారణ చేపట్టారు. బాధ్యత వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## ఐఎస్ఐలో రహస్య యూనిట్..


### భారత్‌లో దాడులే లక్ష్యం

**న్యూఢిల్లీ నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



భారత్‌లో ఉగ్రదాడులతో తమకు ఎలాంటి సంబంధం లేదని బుకాయిస్తూ వస్తున్న పాకిస్థాన్.. స్వయంగా ఆ దేశ నిఘా సంస్థ ఇంటర్–సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ఆధ్వర్యంలో భారత్‌పై ఉగ్ర దాడులకు ఎస్ 1 అనే రహస్య యూనిట్ పనిచేస్తున్నదంటే ఆశ్చర్యం కలుగుతుంది. తగిన శిక్షణ ఇచ్చి ఉగ్రవాదులను భారత్‌కు పంపేందుకే ఈ యూనిట్ ఏర్పడింది. 1983 ముంబై పేలుళ్ల దగ్గర నుంచి తాజాగా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి వరకు ఈ యూనిట్టే ప్రధాన పాత్ర పోషించిందని విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయని ఎన్డీటీవీ వెల్లడించింది.

## సాహిత్య మూర్తి డాక్టర్ నాయకంటి నరసింహాశర్మకు అభినందనలు



**వనపర్తి నవంబర్0 9( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలుగు, సంస్కృత సాహిత్యాల్లో తన అక్షరాలతో అజరామర కాంతి వెదజల్లిన డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ అంతర్జాతీయ సాహిత్య సంస్థ "శ్రీశ్రీ కళా వేదిక" తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ నియామకంపై వనపర్తి సాహితీ కళా వేదిక తరపున అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, కార్యదర్శులు ఓంకార్, నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, కాలగమనం నిరంజనయ్య, బుచ్చిబాబు, గంగవరం రామకృష్ణారెడ్డి తదితరులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. శంకర్ గౌడ్ మాట్లాడుతూ ు "ఈ నియామకం కేవలం ఒక పదవి కాదు, తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు లభించిన గౌరవ మకుటం. డాక్టర్ నరసింహాశర్మ సాహిత్య కాంతి మరింత విస్తరించాలని, ఆయన భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అని పేర్కొన్నారు.

## జూబ్లిహిల్స్‌లో హోరెత్తించిన నవనపర్తి బీఆర్ఎస్ ప్రచారం

మాగంటి సునిత గెలుపు ఖాయం



**వనపర్తి నవంబర్ 09( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ప్రచారం ఉధృతంగా కొనసాగింది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో చివరి రోజు బీఆర్ఎస్ శ్రేణులు హోరెత్తించాయి. రహ్మత్‌నగర్ డివిజన్‌లో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు కె.సి.ఆర్ పది ఏళ్ల సంక్షేమ పాలనకు పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని, సంక్షేమ పథకాలను నిలిపివేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు బోందు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. వనపర్తి నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు గత 22 రోజులుగా ప్రచారం నిర్వహించి ఓటర్లను కలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల విధ్వంస పాలనను వివరించి, మాగంటి సునితకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు మహాలక్ష్మి, వృద్ధులు-వికలాంగులకు పింఛన్లు, రైతులకు రైతు భరోసా, విద్యార్థులకు విద్యా భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం, రైతు బీమా ,రుణ మాఫీ వంటి పథకాల ద్వారా సంక్షేమాన్ని అందించిన బీఆర్ఎస్ పాలనను ప్రజలు గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చరు.

## భక్తిశ్రద్ధలతో 101 వైశ్య దంపతులచే సామూహిక సత్యనారాయణ వ్రతం



**కరీంనగర్, నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కరీంనగర్ చైతన్యపురి కాలనీలో ఆదివారం నలుమాచు రాధా మనోహర్ గృహంలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ మంగళంపల్లి శ్రీనివాస శర్మ పేద పండితుల సమక్షంలో వ్రతాన్ని నిష్ఠగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 101 వైశ్య దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని సత్యదేవుని అనుగ్రహం పొందారు. నిర్వాహకులు నలుమాచు మనోహర్ మాట్లాడుతూ, "గత 8 సంవత్సరాలుగా కార్తీక మాసంలో సామూహిక వ్రతం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందకరం. సత్యదేవుని కృప అందరికీ కలగాలి" అని తెలిపారు. వ్రతాంతంలో తీర్థ ప్రసాదం, అన్నప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ గోవిందవరం భూశంకర శర్మ, బ్రహ్మశ్రీ తనుగుల చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. భక్తుల సందడి, శ్రద్ధ, సమర్పణ వాతావరణాన్ని భక్తిమయంగా మార్చింది.

# పద్మశాలీలు సంఘటితం కావాలి






అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**వరంగల్, నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పద్మశాలీలు తమ హక్కుల సాధన కోసం సంఘటితం కావాలని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. ఆదివారం హాసన్ పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట ప్రాంగణంలో పద్మశాలి కులస్థుల కార్తీక మాస వన భోజన మహోత్సవం వైభవం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మార్కండేయునికి, శివ లింగానికి ఈగ మల్లేశం ప్రత్యేక పూజలు చేసి,జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ పద్మశాలీలు సంఘటితముగా ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావలసిన సంక్షేమ నిధులు, రుణమాఫీ మరియు జి.ఎస్.టి,పరపతి సంఘాలలో పేరుకపోయిన బకాయిలు వెంటనే మాఫీ చేయాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అదేవిధంగా పలుమార్లు ప్రధాన మంత్రిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా మన భారతదేశంలో టెక్స్టైల్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ కాలేజీ కేవలం ఒకే ఒక్క గుజరాత్ రాష్ట్రంలోనే నెలకొల్పబడినది. మన దక్షిణ భారత దేశంలో ఎక్కడా కూడా ఒక్క టెక్స్టైల్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ కాలేజీ లేనందున, మన తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా లో నెలకొల్పబడిన టెక్స్టైల్ పార్క్ లో కూడా పద్మశాలి చేనేత, జౌళి కార్మికుల పిల్లల చదువులకు ప్రత్యామ్నాయంగా టెక్స్టైల్ మరియు డిజైన్ ఇంజనీరింగ్ కాలేజీ ను నెలకొల్పాలని, యారన్ మరియు ముడి సరుకులు మీద కేంద్ర రాష్ట్రాలూ జి.ఎస్.టి ని పూర్తిగా ఎత్తి వేసి పద్మశాలి కార్మికులకు తోడ్పాటు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన హన్మకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, గడ్డం భాస్కర్, వైద్యం రాజగోపాల్, జిల్లా యూత్ అధ్యక్షులు బత్తుల రమేష్ బాబు తదితర కార్యవర్గ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో పద్మశాలి కులస్థులకు ఎంతో మనో ధైర్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశం కు శాలువ మరియు మెమెంటో తో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వడ్నాల నరేందర్, కుసుమ సతీష్, గోరంట్ల రాజు, డి. రామ్మూర్తి, బేతి అశోక్, కుసుమ శ్యామ్, చిలగాని మోహన్, దేవులపల్లి సదానందం, గుండు సదానందం, వెంకన్న, రవీందర్ మరియు మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


## 2025లో అత్యధికమంది వాడుతున్న కామన్ పాస్‌వర్డ్స్ ఇవే..




**న్యూఢిల్లీ నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సైబర్ మోసాలు, హ్యాకింగ్ ముప్పు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ బలమైన పాస్‌వర్డ్‌లు (Passwords) పెట్టుకోవాలని ఐటీ నిపుణులు, పోలీసులు నిత్యం ప్రజలకు సూచిస్తూనే ఉన్నారు. అయినా యూజర్లలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. సైబర్ సెక్యూరిటీ విషయంలో ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ చాలామంది ఇంటర్నెట్ యూజర్లు పాస్‌వర్డ్‌ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తాజాగా ఓ అధ్యయనం ద్వారా వెల్లడైంది. ఇప్పటికీ ఎక్కువ మంది వినియోగిస్తున్న పాస్‌వర్డ్‌గా '123456' మరోసారి టాప్‌లో నిలిచింది. ఈ ఏడాదిలో రియల్ డేటా ఉల్లంఘనల నుంచి 2 బిలియన్లకు పైగా లీక్ అయిన పాస్‌వర్డ్‌లను కంపారిటెక్ పోర్టల్ విశ్లేషించింది. ఇందులో '123456', Admin, 'Aa123456', '123', '1234567890' ,password పాస్‌వర్డ్‌ల జాబితాలో ముందున్నాయి. వీటన్నింటికంటే '123456' పాస్‌వర్డ్‌ను అత్యధిక మంది ఉపయోగించారు. దీన్ని 76 లక్షలకు పైగా ప్రజలు ఉపయోదించారు. ఇక admin' పాస్‌వర్డ్‌ను 19 లక్షల మందికిపైగా ప్రజలు ఉపయోగించారు. 100 అత్యంత సాధారణ పాస్‌వర్డ్‌ల జాబితాలో 'Indiaఏ123' 53వ స్థానంలో ఉందని ఈ అధ్యయనంలో తేలింది.

## ఏ మతస్తులైనా సంఘ్‌లో చేరవచ్చు..

ఆర్ఎస్ఎస్ అధినేత భాగవత్



**న్యూఢిల్లీ నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ముస్లింలు, క్రైస్తవులతో సహా అన్ని మతాలకు చెందిన వారు తమ సంస్థలో చేరవచ్చని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఆదివారం ప్రకటించారు. అయితే తమ మతాలను పక్కనపెట్టి హిందూ సమాజ సభ్యులుగా ఎవరైనా ఆర్ఎస్ఎస్‌లో చేరవచ్చని ఆయన షరతు విధించారు. ఆర్ఎస్ఎస్ రిజిస్ట్రేషన్, నిధుల వివరాలపై కాంగ్రెస్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన విలేకరుల సమావేశంలో జవాబిస్తూ 1925లో ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ తప్పనిసరి కాదని ఆయన చెప్పారు. ఏ రాజకీయ పార్టీని సంఘ్ బలపరచదని, అయితే జాతీయ ప్రయోజనాలు ఉన్నట్లు భావించిన విధానాలను మాత్రం సమర్థిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## మంచినీళ్ల కోసం వెళ్లిన బాలిక సామూహిక లైంగికదాడి..

-నిందితుల్లో మైనర్



**భోపాల్: నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాలో దారుణం జరిగింది. మంచి నీటి కోసం వెళ్లిన బాలికను బలవంతంగా ఎత్తుకెళ్లిన ముగ్గురు సామూహిక లైంగికదాడి చేశారు. నిందితుల్లో ఓ మైనర్ బాలుడు కూడా ఉండటం గమనార్హం. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం 6 గంటలకు మంచినీటి కోసం బాలిక తమ ఇంటి సమీపంలో ఉన్న బోరింగు వద్దకు వెళ్లింది. మైనర్ బాలుడితో సహా అక్కడే ఉన్న మరో ఇద్దరు ఆ బాలికను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు బలవంతంగా తీసుకెళ్లారు. అనంతరం ముగ్గురూ ఒకరి తర్వాత ఒకరు ఆమెపై లైంగిక దాడి చేశారు. అనంతరం అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను పొలంలో వదిలి వెళ్లారు. అయితే బాలిక ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు వెతుకుండగా, పొలంలో అపస్మారక స్థితిలో కనబడింది. హుటాహుటిన బాదితురాలిని దవాఖానకు తరలించారు. అనంతరం లౌర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక చెప్పిన వివరాల ప్రకారం నిందితులను ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## భారీ ఉగ్ర కుట్ర భగ్నం..

ముగ్గురు అనుమానితుల అరెస్టు



**న్యూఢిల్లీ,నవంబర్ 9(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశంలో భారీ ఉగ్ర కుట్రను గుజరాత్ యాంటీ టెరర్రిస్టు స్కాడ్(ఏటీఎస్) భగ్నం చేసింది. ఇందుకు సంబంధించి ముగ్గురు అనుమానితులను ఏటీఎస్ అధికారులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అనుమానితులకు పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అనుమానితులపై ఏడాది కాలంగా నిఘా ఉంచినట్టు తెలిపారు. వారు దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్ర దాడులకు ప్లాన్ చేసినట్టు దర్యాప్తులో తేలింది. ఇందులో భాగంగానే ఆయుధాల మార్పిడి కోసం అనుమానితులు గుజరాత్‌కు వచ్చారని తెలిపారు.